

ఆకట్టుకుంటున్న భారీ గణేశుడు

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటేలా కొలువుదీరిన ఎకో ఫ్రెండ్లీ గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కర్నూలుకు చెందిన యువత ఏకంగా 63 అడుగుల ఎత్తులో ఎకో ఫ్రెండ్లీ గణపతి మూర్తిని రూపొందించింది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఈ భారీ మట్టి వినాయకుడు పూజలు అందుకుంటున్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున ఈ ఉత్సవ గణపతిని నెలకొల్పారు. బంకమట్టి, వెదురు బద్దలు, జనపనార, కొబ్బరి పీచు, గడ్డి, నీటిలో సులువుగా కరిగిపోయే సంప్రదాయ రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఇతర గణపతి మూర్తుల్లా కాకుండా, గణేశ్ నవరాత్రి ఉత్సవాల అనంతరం ఈ మట్టి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించకుండా ఉన్న చోటే నిమజ్జనం చేస్తున్నారు. ఫైర్ ఇంజన్ల ద్వారా నీటిని విగ్రహంపై పిచికారీ చేస్తూ కరిగిన మట్టిని తుంగభద్ర నదిలో కలిసిపోయేలా ఏర్పాట్లు చేశారు. -కర్నూలు కల్చరల్



పింఛన్ లెక్క తప్పింది..!

వృద్ధులు, దివ్యాంగులు, వింతతు మహిళలు.. వివిధ వర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న సామాజిక భద్రత పింఛన్ 'లెక్క' తేలడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేవారు. చనిపోయిన, శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్లిపోయిన లబ్ధిదారుల పింఛన్ మొత్తం ఏ నెలకానెల బ్యాంకులో జమ చేసి చలానా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. మిగిలిన అమౌంట్ సొంతానికి వాడుకున్నారో.. చలానా తీసినా ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదో అధికారులకే ఎరుక. గత జగన్ ప్రభుత్వంలో 2020 - 2024 మధ్య నాలుగేళ్లలో రూ.1.31 కోట్లు జమ చేయలేదు. హొళగుంద మండలంలో ఒక్కటే రూ.30 లక్షలు జమ కావాల్సి ఉంది. జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు రూ.63.33 లక్షల చలానా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన రూ.68.17 లక్షలు ఏమయ్యాయో అర్థం కావడం లేదు.

- లబ్ధిదారులకు పంపిణీ చేయగా మిగులుతున్న నగదు
- ఏ నెలకానెలా బ్యాంకులో జమ చేయని అధికారులు
- 2020-24 మధ్య రూ.1.31 కోట్లకు తేలని లెక్కలు
- కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆగ్రహం
- రూ.63.33 లక్షల చలానా ఆన్‌లైన్‌లో నమోదు
- రూ.68.17 లక్షలు జమ చేసేదెన్నడో..?

కర్నూలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో వివిధ రకాల సామాజిక భద్రతా పింఛన్ల లబ్ధిదారులు జూన్ ఒకటో తారీఖు నాటికి 2,45,687 మంది ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోయిన జనవరి నుంచి రూ.3 వేలకు పెంచారు. నెలనెలా రూ.73.53 కోట్లు పంపిణీ చేశారు. పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఒకటో తారీఖునే పంపిణీ చేస్తూ వచ్చారు. పింఛన్ పంపిణీ తరువాత చనిపోయిన, శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్లిన లబ్ధిదారులు, వివిధ కారణాలు వల్ల పంపిణీ చేయని పింఛన్ డబ్బును ఏ నెలకానెల 10-15వ తేదీలోగా బ్యాంకులో జమ చేయాలి. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల్లో పింఛన్ అమౌంట్ డ్రా చేసి వలంటీర్లకు అప్పగిస్తారు. పంపిణీ చేయగా మిగిలిన డబ్బును డ్రాయింగ్ అథారిటీ కలిగిన అధికారులు బ్యాంక్‌లో జమ చేయడమే కాకుండా ఆన్‌లైన్ లాగిన్‌లో చలానా వివరాలు నమోదు చేయాలి. ప్రతి నెలా 1-5వ తేదిలోగా పింఛన్ల పంపిణీ పూర్తి కావాలి, 15వ తేదీలో పంపిణీ వివరాలు, మిగులు డబ్బు బ్యాంకు చలానా వివరాలు ఆన్‌లైన్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా రూ.1.31 కోట్లు జమ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆ డబ్బును సొంతానికి వాడుకున్నారా..? బ్యాంకులో జమ చేసినా లాగిన్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారా అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి.

రూ.63.33 లక్షల 'లెక్క' తేలింది!

జిల్లాలో 25 మండలాలు ఉంటే 24 మండలాల్లో పింఛన్ మిగులు డబ్బు జమ కావాల్సి ఉంది. అత్యధికంగా హొళగుంద మండలంలో 30.93 లక్షలు, ఆలూరు మండలంలో రూ.10.99 లక్షలు, కౌతాళం మండలంలో 21.69 లక్షలు, మద్దికెర మండలంలో రూ.7.01 లక్షలు, కర్నూలు రూరల్ మండలంలో రూ.8.36 లక్షలు, మంత్రాలయం మండలంలో 8.84 లక్షలు ఉన్నాయి. నాలుగేళ్లుగా పింఛన్ మిగులు డబ్బులు పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ సెక్రటరీలు బ్యాంకుల్లో జమ చేయకపోవడం, చేసినా ఆ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు న్నాయి. కలెక్టరు పి.రంజిత్‌బాషా తక్షణమే ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతో డీఆర్‌డీఏ-వెలుగు, మండల స్థాయి అధికారులు అప్రమత్తమయ్యారు. ఎట్టకేలకు రూ.63.33 లక్షలకు లెక్క తేల్చి చలానా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మరో రూ.68.17 లక్షలకు లెక్క తేల్చాల్సి ఉంది.

చలానాలను పరిశీలిస్తే..

పింఛన్ మిగులు డబ్బులను డ్రాయింగ్ అథారిటీ కలిగిన అధికారులు సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలనెలా బ్యాంకులో జమ చేసి ఆ వివరాలు ఆన్‌లైన్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయకపోవం, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు వరకు లెక్కలు సరి చూడడంలో నాలుగేళ్ల నిర్లక్ష్యం ఉన్నట్లు తెలుస్తోంది. మిగులు డబ్బులు బ్యాంకులో జమ చేసి ఆ వివరాలు లాగిన్‌లో నమోదు చేయలేదా..? ఎవరు గుర్తిస్తారులే..? అంటూ డబ్బులు స్వాహా చేసి.. కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేయడంతో హడావుడిగా బ్యాంకులో జమ చేశారా..? వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రూ.1.31 కోట్లు పింఛన్ మిగులు డబ్బులకు సంబంధించిన బ్యాంకు చలానాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. స్వాహా చేసినట్లు వెలుగు చూసినా, ఆన్‌లైన్ నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా చేసినా శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వారంరోజుల్లోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి

జిల్లాలో నాలుగేళ్లుగా సామాజిక భద్రతా పింఛన్ మిగు లు డబ్బులు రూ.1.31 కోట్ల బ్యాంకులో జమ చేసిన వివరాలు ఆన్‌లైన్ లాగిన్ నమోదు చేయలేదు. కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఏ మండలంలో ఎంత జమ కావాలో గుర్తించి అప్రమత్తం చేశాం. ఇప్పటికే రూ.63.33 లక్షల బ్యాంకు చలానా వివరాలు నమోదు చేశాం. మిగిలిన రూ.68.17 లక్షల చలానా వివరాలు కూడా వారం రోజుల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ఎవరైనా బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు వెలుగు చూస్తే కలెక్టరుకు నివేదిస్తాం.

- సలీంబాషా, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు, కర్నూలు



హొళగుంద మండలంలో పంపిణీ చేయని పింఛన్ మొత్తం గుర్తించిన అధికారులు

మండలాల వారీగా పింఛన్ మిగులు డబ్బు జమ వివరాలు రూ.లక్షల్లో

మండలం	జమ చేయాల్సింది	జమ చేసింది	బ్యాలెన్స్
హొళగుంద	30.93	14.74	16.18
కౌతాళం	21.69	8.28	13.41
ఆలూరు	10.99	2.24	8.74
మద్దికెర	7.01	0.42	6.58
కోసిగి	6.47	0.97	5.49
కర్నూలు రూరల్	8.36	4.41	3.94
కల్లూరు	3.13	0.49	2.64
మంత్రాలయం	8.84	7.07	1.77
కోడుమూరు	3.27	1.64	1.63
కర్నూలు అర్బన్	4.70	3.13	1.56
హాలహర్వి	1.74	0.59	1.15
పత్తికొండ	2.47	1.61	0.86
ఎమ్మిగనూరు	4.69	3.97	0.72
నందవరం	1.88	1.17	0.70
తుగ్గలి	1.79	1.27	0.51
చిప్పగిరి	5.23	4.73	0.49
గోనేగండ్ల	1.22	0.73	0.49
సి.బెళగల్	2.69	2.43	0.25
ఆస్పరి	3.29	3.09	0.20



హొళగుంద మండల పరిషత్ కార్యాలయం

అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్




మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: వంద రోజుల అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వంద రోజుల లక్ష్యాల సాధనపై జిల్లా అధికారులతో సమీక్షించారు. వంద రోజుల లక్ష్యాల సాధనపై ప్రతివారం మండలాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణ కోసం, జీవనోపాధి కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన యోజన పథకం కింద కర్నూలు జగన్నాథ గట్టు, ఆదోని, ఎమ్మిగనూరులలో టిడ్కో ఇళ్ల వద్ద ఖాళీగా ఉన్న స్థలాల్లో నగరవాటికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని టిడ్కో ఎస్ఈ, జిల్లా అటవీ శాఖ అధికారిని ఆదేశించారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీలు ముమ్మరం చేయాలని, అన్ని పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా హాస్టళ్లలో టాయిలెట్లను ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పనకు సంబంధించి ఒక వెబ్‌సైట్ తయారు చేయాలని, రాష్ట్రంలో ఏ సంస్థలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ఆ వెబ్‌సైట్‌లో కనపడేలా లింక్ వివరాలను పొందుపరచాలని జిల్లా ఉపాధి కల్పన అధికారికి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమప్రభాకర్ రాజు, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో 14 స్టేషన్లు విలీనం

సెబ్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: ఎక్సైజ్ శాఖకు పూర్వ ప్రాభవం రాబోతోంది. ఎక్సైజ్ శాఖలోకి 14 సెబ్ స్టేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు తెలిపారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోసిగి, పత్తికొండ స్టేషన్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్, ఆత్మకూరు సెబ్ స్టేషన్లను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. రెండు రోజుల క్రితమే సెబ్ విభాగాన్ని ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలలో జరిగే కేబినేట్ సమావేశం తర్వాత నూతన ఎక్సైజ్ పాలసీ విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించనుంది. ఈలోపు సెబ్ రద్దు.. ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ తదితర అంశాలపై అబ్కారీ శాఖ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది.

పేరుకే తనిఖీలు

- తేల్చిన అక్రమాలకంటే ఖర్చయిందే ఎక్కువ
- రూ.12.55 కోట్ల పనుల్లో రూ.29,903 అవినీతి అట..!
- సామాజిక తనిఖీ ఖర్చు మాత్రం రూ.64 వేలు
- రూ.6 లక్షలు మాయంపై చర్యలు శూన్యం
- జిల్లా ఉన్నతాధికారులపై అనుమానాలు

కోడుమూరు, సెప్టెంబరు 13: ఉపాధి హామీ పథకం పనుల్లో బయట పడిన అవినీతి కంటే సామాజిక తనిఖీ కోసం చేసిన ఖర్చే ఎక్కువ కావడం విమర్శలకు తావిస్తోంది. దీంతో ఇలాంటి అధికారులా.. అక్రమాలపై చర్యలు తీసుకునేది అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కోడుమూరులో 15 రోజులుగా ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టింది. అనంతరం ఈ నెల 12న మండల పరిషత్ ఆవరణలో జిల్లా ఉన్నతాధికారులు సామాజిక బహిరంగ సభ నిర్వహించారు. అయితే రూ.12.55 కోట్ల పనులు జరిగితే రూ.29,903 మాత్రమే అవినీతి జరిగిందని ప్రకటించారు. మండలంలో అనేక అక్రమాలు జరిగితే వాటిని వెలుగులోకి తీసుకురాకుండా చేతులు దులుపుకోవడంపై పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇటీవల సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

మండలంలో జరిగిన పనులు: కోడుమూరు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు 640 పనులు చేపట్టారు. డబ్బు రూపంలో కూలీలకు దాదాపు రూ.7,11,23,693 చెల్లించారు. అలాగే పీఆర్ శాఖ వంటి పరిధిలో సచివాలయం, అంగన్‌వాడీ, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు వంటి భవన నిర్మాణ కోసం మెటీరియల్ రూపంలో సుమారు రూ.5,46,12,761 బిల్లులు చెల్లించారు. మొత్తం రూ.12,55,36,454 నిధులు విడుదల చేశారు.



ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు..

మండలంలో గోరంట్ల, ముడుమలగుర్తి, వెంకటగిరి, వర్కూరు, ప్యాలకుర్తి, అనుగొండ, ఎర్రదొడ్డి గ్రామాల్లో జరిగిన పనుల్లో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే అక్రమాలను వెలికి తీయడంలో తనిఖీ బృందం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలు ఉన్నాయి. సామాజిక తనిఖీ బృందంలోని దాదాపు ఎనిమిది మంది సభ్యులు 15 రోజులు తనిఖీలు నిర్వహించగా వాళ్ల రవాణా, భోజనం ఖర్చు రూ.64 వేలు ఖర్చు చేసినట్లు రికార్డులు చెపుతున్నాయి. అంటే రూ.12.55 కోట్లలో పనుల్లో రూ.29,903 అవకతవకలు జరిగినట్లు తేల్చడానికి తనిఖీ బృందం చేసిన ఖర్చు రూ.64 వేలు. దీంతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు వ్యవహరించిందన్న విమర్శలు ఉన్నాయి.

డబ్బు విడుదల చేయడం వాస్తవమే



చేసిన పనులకు మించి ఎక్కువ డబ్బు విడుదల చేయడం వాస్తవమే. సదరు వెండర్ చేత డబ్బును తిరిగి చెల్లించారు. ఈ పొరపాటు ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. ఈ విషయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, కంప్యూటర్ ఆపరేటర్లే జవాబు చెప్పాలి.

-చంద్రశేఖర్, ఎంపీడీవో, కోడుమూరు

రూ.6 లక్షల సంగతేంటీ ?: కోడుమూరు పట్టణానికి చెందిన వైసీపీకి చెందిన నాయకుడు పట్టణంలో ఐదో సచివాలయ నిర్మాణం చేపట్టాడు. సచివాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.43.60 లక్షలు విడుదల చేసింది. నిర్మాణ వ్యయంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధుల్లో నుంచి చివరి బిల్లు కారణంగా 2023 ఆగస్టులో రూ.6,36,738 సదరు వెండర్‌కు జమ చేశారు. ఒక బిల్లు చెల్లించాల్సిన సంబంధిత అధికారులు రూ.6,36,738 రెండు సార్లు సదరు కాంట్రాక్టర్ బ్యాంకుకు జమ చేశారు. ఈ విషయం ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో బట్టబయలు కావడంతో మండల స్థాయి అధికారులకు చెమటలు పట్టాయి. వచ్చిన డబ్బు ఖర్చు చేశానని, సదరు కాంట్రాక్టర్ తిరిగి డబ్బు చెల్లించడానికి ఒప్పుకోలేదని తెలిసింది. మండల స్థాయి అధికారుల ప్రమేయంతో చివరకు సదరు కాంట్రాక్టర్ చేత సామాజిక బహిరంగ సభలో రికవరీ చేయించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చేసిన పనులకు మించి డబ్బును విడుదల చేయడంలో ఎవరి పాత్ర ఎంత ఉంది. ఏ ఉద్దేశంతో విడుదల చేశారని జిల్లా అధికారులు విచారించకుండా.. తప్పు చేసిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోకుండా రక్షించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీశైల జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యాం

శ్రీశైలం, సెప్టెంబరు 13: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జలాశయం క్రస్టుగేట్లను మూసివేశారు. జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 56,056 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు మొత్తం 76,152 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమాయానికి జలాశయానికి 82,139 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,824 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కృషి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ప్రకాశ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ ఉమ్మడి జిల్లాలో సంస్థ అందిస్తున్న సేవలు, 4జీ టవర్లు, ఫైబర్ నెట్ వర్క్ గురించి ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో 340 టవర్లు ఏర్పాటు చేయడానికి ముందుకు పోతోందన్నారు. ఫైబర్ నెట్ సేవలు అందించేందుకు ప్రయత్నాలు కూడా చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం అడ్మిన్ యు.శ్రీనునాయక్, డీజీఎం రాజాశ్వరరావు, డీఈలు నారాయణస్వామి, మురళీక్రిష్ణ, జాన్సన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న టైపిస్టు అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: ఏపీ రాష్ట్ర టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.క్యాంపు సెంటర్‌లోని టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేసన్ భవనంలో జరిగే ఎన్నికలకు ఉప ఎన్నికల అధికారిగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.విజయ్ కుమార్, పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ వ్యవహ రిస్తారని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌గోపాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్ నాయక్ హాజరవుతారని చెప్పారు. ఈ నెల 18లోపల ఉమ్మడి జిల్లాలోని ప్రతి టైపిస్టు, స్టెనోగ్రాఫర్ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఎల్ఎల్‌బీ పరీక్షలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: ఎల్ఎల్‌బీ నాలుగో సంవత్సరం 7వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉస్మానియా కళాశాలలో 46 మందికిగాను 40 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు.

బయోమెట్రిక్ హాజరుపై ఎన్ఎంసీ సీరియస్

- వైద్యుల ఆలస్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 13: కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యుల బయోమెట్రిక్ లేట్ హాజరుపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సీరియస్ అయింది. జూలై, ఆగస్టు నెలల్లో బయోమెట్రిక్ హాజరును వైద్యులు ఆలస్యంగా వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు వైద్యులు మెడికల్ కాలేజీకి వచ్చినప్పుడు ఉదయం 9 గంటలలోపు అలాగే ఇంటికి వెళ్లేటప్పుడు హాజరును సాయంత్రం 4 గంటలకు నమోదు చేయాలి. అయితే కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం 9 గంటల నుంచి 9.10 గంటలకు ఎక్కువ సంఖ్యలో హాజరు వేస్తుండటంపై ఎన్ఎంసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలేజీలో 360 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు, పీజీలు ఉన్నారు. ఉదయం 9 నుంచి 9.10 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌లో అత్యధిక సంఖ్యలో హాజరు వేస్తున్నారు. ఇలా కుదరదని, ఉదయం 9 గంటలలోపు హాజరు వేయాలని, ఉదయం 9 గంటల తర్వాత బయోమెట్రిక్ వేస్తే లేటు హాజరు కిందకు వస్తుందని ఎన్ఎంసీ కరాఖండిగా చెప్పింది. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ చర్యలు ప్రారంభించారు. ఆలస్యంగా హాజరు వేసిన 30 మంది వైద్యులు, సీనియర్ రెసిడెంట్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుందూనదిలో ముమ్మర గాలింపు

ఒక మృతదేహం లభ్యం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: మండలంలోని కలుగొట్లకు చెందిన బాలగురప్ప, రామసుబ్బారెడ్డి గురువారం కుందూలో గల్లంతైన విషయం విదితమే. ఎస్డీఆర్ఎఫ్ పోలీసు బలగాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి శవాల ఆచూకీ తెలపాలని వారికి ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలుకు చెందిన ఎస్డీఆర్ఎఫ్ పోలీసు బృందంలోని 18 మంది కలుగొట్లలోని కుందూ వద్దకు చేరుకని గల్లంతైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలగురప్ప మృతదేహం లభ్యమైంది. రామసుబ్బారెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలగురప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించారు.

గణనాథుల వీడ్కోలుకు సన్నాహాలు

- 1,689 మంది పోలీసులతో బందోబస్తు
- సీసీ కెమెరాలతో నిఘా
- రూ.41.25 లక్షల నిధులతో ఏర్పాట్లు
- సిద్ధంగా ఎనిమిది క్రేన్లు.. గజ ఈతగాళ్లు
- కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు, సెప్టెంబరు 13: గణనాథుల వీడ్కోలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నగరంలో గణేశ్ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 9వ రోజు ఆదివారం నిమజ్జనానికి అంతా సిద్ధమయ్యారు. విజయవాడ వరదల నేపథ్యంలో సుమారు 400 మంది పోలీసులు అక్కడ బందోబస్తుకు వెళ్లారు. సిబ్బంది కొరత నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. బందోబస్తుకు క్లిష్టమవుతున్న నేపథ్యంలో మూడు, ఐదు రోజులకే గ్రామాల్లో, మండలాల్లో నిమజ్జనాలు చేయించారు. కర్నూలు నగరంలో మాత్రమే 9వ రోజు నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నారు. కర్నూలు నగరంలో సుమారు రెండు వేల విగ్రహాలు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఈసారి క్యూఆర్ కోడ్‌తో జియోట్యాగింగ్ చేసి సాంకేతికతను ఉపయోగించారు. ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం పోలీసుల వద్దనే ఉంది. ఆన్‌లైన్‌లో వెళ్లి లోకేషన్ ఆప్షన్ బటన్ ప్రెస్ చేస్తే సంబంధిత విగ్రహాల వివరాలు తెలుస్తాయి.



మాట్లాడుతున్న ఎస్పీ

పోలీసు బందోబస్తు: ఆదివారం గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో శాంతియుతంగా సంప్రదాయ రీతిలో నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునే విధంగా చర్యలు చేపట్టారు. నిమజ్జనంలో బందోబస్తు విధుల్లో అడిషినల్ ఎస్పీ ఒకరు, 11 మంది డీఎస్పీలు, 58 మంది సీఐలు, ఆర్ఐలు, 133 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, 346 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 642 మంది పోలీసు కానిస్టేబుల్స్, 34 మంది హోంగార్డులు, 6 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 15 స్పెషల్ పార్టీ బృందాలను నియమించారు. కర్నూలు జిల్లాతోపాటు అన్నమయ్య, కడప, నంద్యాల జిల్లాల నుంచి బందోబస్తును నియమించారు. మొత్తం 1689 మంది పోలీసులతో భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం రోజున బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టేలా ఆదేశాలు వచ్చాయి. నిమజ్జనం కార్యక్రమంతా డ్రోన్, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై గట్టి నిఘా ఉంచారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

నిమజ్జనం సందర్భంగా ఆదివారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. 15న ఉదయం 10 గంటలను గణేశ్ నిమజ్జనం కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎస్పీ తెలిపారు. అత్యవసర 108, ఫైర్, అంబులెన్సులు, పోలీసు వాహనాలు సేవల కోసం పోలీసులతో అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారన్నారు.

- ఆర్టీసీ బస్టాండు నుంచి రాజ్‌విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్, గాయత్రీ ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి ఉండదు.
- ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలను బళ్లారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రల్ బంకు, బిర్లా కాంపౌండ్, మద్దూరు నగర్ సర్కిల్, సీ క్యాంపు మీదగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వాహనాల రాకపోకలు ఉంటాయి.
- ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు సీ క్యాంపు, బిర్లా గేటు, గుత్తి పెట్రోల్ బంకు మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- హైదరాబాదు, గద్వాల అలంపూరు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.

నిమజ్జనం పూర్తయిన తర్వాత వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్తాయి.

పోలీసుల సూచనలు: రాంబోట్ల దేవాలయం నుంచి మొదటి విగ్రహం బయలుదేరుతుంది. నగరంలోని విగ్రహాలు వీలైనంత త్వరగా నిమజ్జనానికి సిద్ధం కావాలి.

- విగ్రహాలను పోలీసులు బయలుదేరే సమయంలో కరెంటు తీగల వద్ద వినాయక విగ్రహాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విగ్రహాలను తరలించడానికి ముందు రోజే వాహనాలను క్రేన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలు నిమజ్జన ఊరేగింపు వాహనాలకు దూరంగా ఉంచాలి.
- నిమజ్జన ఘాట్ల దగ్గరకు నిమజ్జనానికి వీక్షించేందుకు వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి.
- విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో ఇతరుల మనోభావాలను కించపరిచేలా విధగా వ్యవహరించకూడదు.
- ఆసుపత్రుల దగ్గర హోరెత్తించే డీజేలతో రోగులకు ఇబ్బందులు కలిగించరాదు.. భారీ లౌడ్ స్పీకర్లు, డీజేలతో అధిక శబ్దాలు చేస్తే చర్యలు ఉంటాయి.
- ఆకతాయిలు మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటారు.
- మతపెద్దలు, రాజకీయ పార్టీలు, శాంతి కమిటి సభ్యులు, యువత శాంతియుత వాతావరణానికి సహకరించాలి.
- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.41.25 లక్షలు వెచ్చించి అట్టహాసంగా నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నారు. నగరమంతా మైకులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. 25 ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఒక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ల కోసం నిధులు వెచ్చిస్తున్నారు. 6 ఘాట్లలో 8 క్రేన్లను సిద్ధం చేశారు. అదనంగా రెండు క్రేన్లను సిద్ధంగా ఉంచారు. పలు చోట్ల తాగునీటి సరఫరా కోసం నిధులు వెచ్చిస్తున్నారు. 250 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. వినాయక ఘాట్‌ను అదనంగా పెయింటింగ్‌తో సుందరీకరించారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి


నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాం. ఎక్కడ అనుమానితులు కనిపించినా సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. మసీదులు, చర్చిల వద్ద డీజేలకు అనుమతులు లేవు. ఎప్పటికప్పుడు విగ్రహాలు నిమజ్జనానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సీఐలకు ఆదేశాలు ఇచ్చాం. మద్యం సేవించి ఆకతాయిలు అల్లర్లు చేస్తే కఠిన చర్యలు ఉంటాయి.

\- ఎస్పీ బిందు మాధవ్

పెద్దాసుపత్రిలో ఫిర్యాదుల బాక్సులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 13: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ వినూత్న పరిపాలనకు శ్రీకారం చుట్టారు. వంద రోజుల పరిపాలన సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఐదు చోట్ల ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆసుపత్రిలో కొత్తగా ఏఎంసీ, క్యాజువాల్టీ వార్డులను ఏర్పాటు చేసి అత్యవసర రోగుల బెడ్ల కొరతను తీర్చిన ఆయన ఆ తర్వాత వార్డుల్లో ఫ్యాన్లు, లైట్లు, దాతల సహాయంతో వేయించడం, డ్రైనేజీ వ్యవస్థను మార్చడంతోపాటు ఎన్ఆర్ఐల సహకారంతో పరికరాలను సమకూర్చారు. ప్రస్తుతం రోగుల సమస్యలను పరిష్కరించేందుకు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్, క్యాజువాల్టీ గైనిక్, పీడియాట్రిక్,, సుశ్రుత భవన్ ప్రాంతాల్లో ఐదు చోట్ల ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయించారు. ఆసుపత్రిలో ఎవరైనా డబ్బులు అడిగినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా డ్యూటీలో ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీ విపరీతంగా పెరగడంతో సాయంత్రం ఓపీ 3 నుంచి 4 గంటల వరకు జరిగే ఓపీలను ఆ యూనిట్ ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఓపీ ఉన్న వైద్యులకు ఆ రోజు అకాడమిక్ తరగతులకు మినహాయింపు ఇవ్వనున్నారు. సాయంత్రం ఓపీల పర్యవేక్షణ బాధ్యతలను సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డా.బీవీ రావుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఓపీ రోగుల వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.

రోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదుల బాక్సులతో సూపరింటెండెంట్

బస్సు కింద పడి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె సర్కిల్‌లో జరిగింది. అమడాల గ్రామానికి చెందిన గురప్ప(45) కూలి పని నిమిత్తం రోజూ కోవెలకుంట్లకు వచ్చేవారు. శుక్రవారం కోవెలకుంట్లలోని పాండురంగస్వామి దేవాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ముందు కాలువ పని చేసి ముగించుకుని తిరిగి అమడాలకు బయలుదేరాడు. బనగానపల్లె సర్కిల్ వద్దకు వచ్చేసరికి ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బనగానపల్లె నుంచి కోవెలకుంట్లకు వస్తూ మలుపు వద్ద ఢీకొట్టింది. గురప్ప బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోవెలకుంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అమానవీయం



- కొడుకు ప్రేమ పెళ్లి చేసుకున్నాడని తల్లికి శిక్ష
- స్తంభానికి కట్టేసి కొట్టిన యువతి తల్లిదండ్రులు
- తనకేమీ తెలియదని విలపించినా వదిలిపెట్టని దైన్యం
- విడిపించే ప్రయత్నం కూడా చేయని గ్రామస్థులు
- పోలీసుల చొరవతో ఆసుపత్రిలో చేరిన బాధితురాలు

కొడుకు ప్రేమ పెళ్లి చేసుకున్నాడని తల్లిని దారుణంగా కొట్టారు. స్తంభానికి కట్టేసి.. వందలాది మంది చూస్తుండగానే విచక్షణా రహితగా దాడి చేశారు. చీర, రవికను చించేశారు. తనకేమీ తెలియదని ఆ తల్లి వేడుకున్నా ఆ కర్కశకులు వినిపించుకోలేదు. బోరున విలపిస్తున్నా గ్రామస్థుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు వచ్చి విడిపించలేదు. చివరకు ఇంట్లో బంధించబడిన బాధితురాలి చిన్న కొడుకు తన తల్లి ఆర్తనాలు విని పోలీసులకు ఫోన్ చేశాడు. దీంతో వారు గ్రామానికి చేరుకొని ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ అమానవీయ ఘటన పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.

పెద్దకడుబూరు, సెప్టెంబరు 13: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల సమాచారం మేరకు.. కల్లుకుంట గ్రామంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన నరసప్ప, గోవిందమ్మ దంపతు లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నరసప్ప ఐదేళ్ల క్రితం మృతి చెంద గా గోవిందమ్మ పిల్లలతో కలిసి గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె పెద్దకుమారుడు ఈరన్న అదే గ్రామంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ వారిని ఎమ్మిగనూరు డీఎస్పీ దగ్గరకు పంపారు. దీంతో ఎమ్మిగనూరు డీఎస్పీ ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి నచ్చజెప్పి పంపారు. అలాగే కొన్ని రోజులు ఇంటికి దూరంగా ఉండాలని ప్రేమ జంటకు సూచించారు. దీంతో వారు బెంగళూరుకు వెళ్లిపోయారు. ఈరన్న తల్లి గోవిందమ్మ, తమ్ముడు రాజు మాత్రం ఎమ్మిగనూరులో నివాసం ఉంటున్నారు. అయితే గురువారం చిన్న కుమారుడితో కలిసి పని నిమిత్తం గోవిందమ్మ గ్రామానికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఆమె ఇంటి దగ్గరకు వెళ్లి గొడవకు దిగారు. రాజును ఇంటిలోకి నెట్టివేసి గోవిందమ్మను బీసీ కాలనీలోకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. చీర, రవికను చింపివేశారు. తనకేమీ తెలియదని, వదిలిపెట్టాలని విలపించినా వదిలిపెట్టలేదు. వందలాది గ్రామస్థులు చూస్తూనే ఉన్నారు తప్పా విడిపించలేదు. గోవిందమ్మ అరుపులు, కేకలు విన్న కుమారుడు తన తల్లిని చంపివేస్తున్నారంటూ పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఎస్ఐ వెంటనే తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. గోవిందమ్మను విడిపించి పోలీసు జీపులో ఎక్కించుకొని స్టేషన్‌కు తరలించాడు. అక్కడి నుంచి బాధితురాలిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు ఎస్ఐ పది మందితోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసు కున్న దళిత సంఘాలు భగ్గుమన్నాయి. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సీఐ మంజు నాథ్‌ను కలిసి కోరారు. అలాగే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందమ్మను పరామర్శించారు. నింది తులను అరెస్టు చేయా లని కేవీపీఎస్, ఏపీఎమ్మార్పీఎస్, నవ్యాంధ్ర ఎమ్మా ర్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మిగ నూరు పట్టణంలో ఆందోళన నిర్వహించారు.



చికిత్స పొందుతున్న గోవిందమ్మ

ప్రత్యేక పూజల్లో రాఘవ లారెన్స్

మంత్రాలయం, సెప్టెంబరు 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామిని సినీ హీరో, డాన్స్‌మాస్టర్ రాఘవ లారెన్స్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి తపస్సు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి, ఇచ్చాలలో వెలసిన ఏకశిల బృందావనం, అప్పన్నాచార్ బృందావనం, పురాతన నివాసాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కొలువుదీరిన గణనాథులను దర్శించుకుని వినాయక భక్త బృందంతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రాఘవ లారెన్స్ మాట్లాడుతూ చెన్నై సమీపంలో 20 ఎకరాల స్థలంలో రాఘవేంద్రస్వామి బృందావనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం స్థల పరిశీలన పూర్తయిందని, త్వరలో ఆర్కిటెక్ట్ శిలామండప నిపుణులతో చర్చించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంచన-4 చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న రాఘవ లారెన్స్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను కలెక్టర్‌తో పాటు జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న నగరంలోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 ప్రైవేటు కంపెనీలలో ఉన్న 500 ఖాళీ ఉన్నాయని, 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ అండ్ టీ కంపెనీలో ఉన్న 120 ఖాళీల భర్తీ కోసం ఎస్వీ కాంప్లెక్స్ సమీపంలోని ఎస్టీబీసీ కళాశాల దగ్గర ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8688030375, 9059524482, 7780478910 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిప్పగిరి, సెప్టెంబరు 13 : మండల కేంద్రానికి చెందిన కురువ కురుమంచప్ప అనే వ్యక్తి గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ వివరాల మేరకు.. బట్టలు లాండ్రీకి ఇవ్వడానికి గురువారం సాయంత్రం కారు మంచప్ప ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ రింగ్ అవుతున్న ఎత్తకపోవడంతో ఆయన కుమారులు గుంతకల్లు, ఆ వైపు ఉన్న తమ పొలాల వెంట గాలించారు. చివరకు హంద్రీనీవా కాలువ దగ్గరలో ఉన్న గోడౌన్ వద్ద కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. సంఘటనా స్థలాన్ని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పరిశీలించారు. జాగిలాలు, పరిశీలన బృందాలతో కారు మంచప్ప ఉరి వేసుకున్న మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా చంపి అక్కడ చెట్టుకు వేలాడ తీశారా అన్న కోణంలో విచారణ చేపట్టారు. చిప్పగిరి ఎస్సై రమేష్ బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతురులు కాగా అందరికీ పెళ్లిళ్లు చేశాడు.



కారు మంచప్ప (ఫైల్)

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బనగానపల్లె, సెప్టెంబరు 13: బనగానపల్లె పట్టణంలో ఇటీవల సప్తగిరి లాడ్జిలో జరిగిన చోరీ కేసులో శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాలివీ.. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన దానమయ్య అనే వ్యక్తి భార్య చనిపోవడంతో చెడువ్యవసనాలకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సప్తగిరి లాడ్జి నిర్వహిస్తున్న పార్వతి అనే మహిళ ఈనెల 6న లాడ్జికి తాళాలు వేస్తుండగా అకస్మాత్తుగా హెల్మెట్ ధరించి వచ్చిన దానమయ్య ఆమె తలను గోడకేసి కొట్టాడు. బంగారు గొలుసు, కమ్మలను తీసుకొని బైకుపై పారిపోయాడు. గట్టిగా అరిస్తే ఉరివేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు దానమయ్యను గుర్తించారు. బంగారు కమ్మలు అమ్మినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. అవుకు రహదారిలోని గోదాము వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి మోటారు సైకిల్‌పై వస్తున్న దానమయ్య పారిపోవడానికి యత్నించాడు. అయితే పోలీసులు వెంబడించి దానమయ్యను అదుపులోకి తీసుకున్నారు.

పొలంబడిపై శిక్షణ



మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 13: తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు పంట సాగులో పూర్తి స్థాయి అవగాహన కల్పించి వారు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందేలా టీడీపీ ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన ఇండిగ్యాప్ పొలంబడి సర్టిఫికేషన్ కార్యక్రమం అమలుపై శుక్రవారం నగరంలోని ఉద్యానభవన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కర్నూలు వ్యవసాయశాఖ జేడీ పీఎల్ వరలక్ష్మితో పాటు నంద్యాల జేడీ హాజరయ్యారు. కమిషనరేట్ నుంచి ప్రతాప్ రెడ్డి, కిరణ్మయి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రైతులకు నూతనంగా అమలులోకి రానున్న ఇండిగ్యాప్ పొలంబడి నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించాలో జేడీ వరలక్ష్మి వివరించారు.

ఆర్‌యూ వీసీపై ఫిర్యాదు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనరు ఎస్. విజయభాస్కర్ కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోని యూజీసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ విచారణలో ఆయనపై చార్జ్‌షీట్ దాఖలు చేయాలని అప్పటి పాలకమండలి తీర్మానిస్తే ఆ తీర్మాణాలను అమలు చేయనీయకుండా వైసీపీ ప్రభుత్వ అండదండలతో అడ్డుకున్నారని ఆరోపించారు. అప్పట్లో సీబీసీఐడీ, విజిలెన్స్ ఉన్నత విద్యాశాఖ మండలికి ఎన్‌టీకేనాయక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఎటువంటి ఆర్థిక పరమైన శాఖల్లో పదవులు అర్హుడు కాదని, సర్వీసు రికార్డుల్లో కూడా రెండు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ వేటు వేశారని తెలిపారు. మురళీ, సుంకన్న తదితరులు ఉన్నారు.

'ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టాలి'

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 13: ప్రాచీన రామాలయాల్లో పేటశ్రీ రామాలయం ఒకటని, రెండవది రాంబొట్ల దేవాలయం అని, ఈ ఆలయాలను జీర్ణోద్ధరించాలని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డా.మోక్షేశ్వరుడు అన్నారు. శుక్రవారం స్థానిక పాతనగరంలోని శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి నెలా జరిగే ఊంజల సేవలో మోక్షేశ్వరుడు ముఖ్యఅతిథిగా హాజరై పలు విషయాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక చవితి ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చి వినాయకుడి చిత్రలేఖన, మట్టి వినాయకులను తయారు చేసే పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయం మాజీ అర్చకులు కట్ట సుబ్రహ్మణ్య శర్మ సంస్మరణలో సరస్వతి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర ప్రసాద్, ఏల్చూరు ద్వారకానాథ్, వేదవ్యాసమూర్తి, భానుప్రకాష్, మాణిక్యరెడ్డి, కళ్యాణి, విఠల్‌రావు, శ్యాం పాల్గొన్నారు.

'వాటర్‌షెడ్ పనులను వినియోగించుకోండి'

ఓర్వకల్లు, సెప్టెంబరు 13: వాటర్‌షెడ్ పనులను రైతులు వినియోగించుకోవాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ సూచించారు. శుక్రవారం ఓర్వకల్లులోని పంచాయతీ కార్యాలయంలో ఈవో ఆర్‌డీ సుబ్బరాయుడు గ్రామసభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శివనాగప్రసాద్ హాజరయ్యారు. నూతన వాటర్‌షెడ్ చైర్మన్‌గా వేణుగోపాల్ రెడ్డి, వైస్‌చైర్మన్‌గా సత్యవేణి, సెక్రటరీగా జీకే నాగరాజు, మెంబర్లుగా శాలమ్మ, సరోజమ్మ, నారాయణరెడ్డి, సలాం, గంగీశ్వరరెడ్డి, బాలు, ఇస్మాయిల్, ఎస్ఎండీ వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ అధికారులు ఇంజనీర్ అయూబ్, సోషల్ ఆర్గనైజర్ షేక్ అహ్మద్, నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు, సెప్టెంబరు 13: పత్తి, కంది, పొగాకు పంటల్లో వచ్చిన తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం కర్నూలు శాస్త్రవేత్తలు పి.సుజాతమ్మ, ఎం.రవికిషోర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం గ్రామాల్లో పత్తి, కంది, పొగాకు పంటలను శాస్త్రవేత్త పి.సుజాతమ్మ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో కలిసి వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పత్తిలో పచ్చదోమ అధికంగా ఉందని, దీని నివారణకు ఉలాల ఫ్లోనిక్‌మైడ్ మందును ఎకరాకు 60 గ్రాముల లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు నజీర్, వెంకటేశ్వర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయపాటి శ్రీనివాస్‌కు ఎక్సలెన్సీ అవార్డు



కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 13: కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. ఈజిప్ట్ దేశానికి చెందిన ఆర్ట్ అండ్ పొయెట్రీ ఫోరం సంస్థ అంతర్జాతీయ స్థాయి ఎక్సలెన్సీ అవార్డును అంతర్జాలం ద్వారా ప్రకటించి శుక్రవారం అందజేసింది. డాక్టర్ రాయపాటి లయన్స్ క్లబ్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రకటించింటినట్లు ఆర్ట్ అండ్ పొయెట్రీ ఫోరం అధ్యక్షుడు వీల్ ఆదల్ మహమ్మద్ ఫోన్ ద్వారా తెలియజేసినట్లు డాక్టర్ రాయపాటి తెలిపారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి

ఓర్వకల్లు, సెప్టెంబరు 13: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శివనాగప్ర సాద్ ఆదేశించారు. శుక్రవారం ఎలిమెంటరీ స్కూల్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, అయూబ్ బాషా, మోహన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: నంద్యాల పార్లమెంట్ పరిధిలో బీఎస్ఎన్ఎల్(టెలికాం) సలహా కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినందుకు టీడీపీ సీనియర్ నాయకుడు మల్లెల పుల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్ర వారం నగరంలోని ఆటో నగర్‌లోని ఎంపీ నివాసంలో ఎంపీ బైరెడ్డి శబరి చేతులు మీదుగా ఎంపికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ పరిధి లోని పాములపాడు కురువ రమేష్, పాణ్యం చిట్టిపోయిన శ్రీనివాస్ యా దవ్, కల్లూరు మధు, ఆత్మకూరు గౌస్ లాజం, నూనెపల్లె పెరుమాళ్ల విజయ కుమారును నియమించారని తెలిపారు.

కొనసాగుతున్న
గణేశ్ ఉత్సవాలు

వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన వినాయక విగ్రహాలు ఏడో రోజూ శుక్రవారం ప్రత్యేక పూజలందుకున్నాయి. వినాయక మండపాల్లో బొజ్జ గణపయ్యలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. నగరంలోని నరసింహారెడ్డి నగర్, సుంకేసుల రోడ్డులోని గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్, బుధవారపేట, షరీన్‌నగర్, గాయత్రి ఎస్టేట్, ఆరోనానగర్, మాధవీనగర్, బిర్లాగేట్, రాఘవేంద్ర మఠం, షరాఫ్ బజార్ తదితర ప్రాంతాల్లో గణేశ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.


\- కర్నూలు, కల్చరల్




మాధవీనగర్‌లో కొలువుదీరిన వినాయకుడు



ఆరోరానగర్‌లో..



సి.క్యాంప్ రైతు బజార్‌లో..



బిర్లాగేట్‌లో..



46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో..



షరాఫ్ బజార్‌లో..



కల్లూరు ఆదిత్యా స్కూల్ లైన్‌లో..



గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్‌లో..

వరద బాధితులకు విరాళాలు



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న నాయకులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల సహాయార్థం, ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆలిండియా సెంట్రల్ పారా మిలిటరీ ఫోర్సెస్ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విరాళం అందిం చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు రూ.75 వేల విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. అసోసి యేషన్ జిల్లా కమిటీ తరపున అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. బాలరంగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ అసోసియేషన్ కార్యదర్శి జి. శేషారెడ్డి, యూనియన్ ట్రెజరర్ పీటీ స్వామి, యూనియన్ సలహాదారులు కేకే రావు, కేసీఎస్ రాయుడు పాల్గొన్నారు.

సి.బెళగల్: విజయవాడ వరద బాధితులకు సి.బెళగల్ పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న ఈరమ్మ ఒక నెల గౌరవ వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆమె భర్త బడెసా టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి అందజేశారు. టీడీపీ నాకుడు తిమ్మప్ప, ఎంపీటీసీ ఈరన్న గౌడు, విష్ణుసేన నాయకుడు భీమన్న, తదితరులు ఉన్నారు.

ప్రతి నెల సదరం స్లాట్స్ నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: విభిన్న ప్రతిభావంతులకు ప్రతి నెలా సదరం స్లాట్స్ నిర్వహించాలని జిల్లా వికలాంగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప కోరారు. శుక్రవారం జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే కోటాల్లో విభిన్న ప్రతిభావంతులకు న్యాయం చేయాలని కోరారు. మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు

కల్లూరు, సెప్టెంబరు 13: కల్లూరు అర్బన్ పరిధిలోని అబ్బాస్‌నగర్, కృష్ణానగర్, తహసీల్దార్ కార్యాలయం, వాసవీనగర్, వెంకటేశ్వరస్వామి సమీపంలోని వినాయక విగ్రహాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత సందర్శించుకున్నారు. శుక్రవారం ఆయా కాలనీల వినాయక భక్తబృందం ఏర్పాటు చేసిన విగ్రహాలకు గౌరు చరిత ప్రత్యేక పూజలు చేశారు. కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● 20వ వార్డు శ్రీనగర్‌కాలనీలో సాక్షి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా భక్త బృందం అన్నదానం చేశారు.

● కర్నూలు మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు బ్రహ్మానందగౌడ్, అంజద్, అక్బర్, స్వాములు వరద బాధితుల కోసం రూ.60 వేల చెక్కును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. అదేవిధంగా 36వ వార్డు వాసవీనగర్‌లోని శివాలయం చైర్మన్ సుధాకర్‌రెడ్డి రూ.లక్ష, టీడీపీ నాయకుడు నాగరాజు రూ.50 వేలు, వెంకయ్యనగర్ చిన్న పెద్దయ్య రూ.50 వేలు చెక్కులను అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సహకారం అందించ ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే గౌరు చరిత అభినందించారు.



శ్రీనగర్ కాలనీలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్త బృందం



పూజల అనంతరం ఎమ్మెల్యేకు గౌరు చరితకు వరద బాధితుల కోసం చెక్కును అందజేస్తున్న భక్తుడు

కర్నూలు(కలెక్టరేట్): కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతికి శుక్రవారం ఎస్పీ బిందు మాధవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సమాచార భవనంలో వీరు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం చేపట్టడం పాత్రికేయుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఎస్పీ, పాణ్యం ఎమ్మెల్యే, కర్నూలు ఎంపీలకు పాత్రికేయులు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, విలేకరులు సాయి కుమార్ నాయుడు, శ్రీనాథ్ రెడ్డి, మంజునాథ్, సత్యనా రాయణ గుప్త, ప్రకాష్, మల్లికార్జున, రవి, ఉరుకుందు, ప్రసాద్, చిరంజీవి, మధు, చిన్న రావ రాంజనేయులు పాల్గొన్నారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎస్పీ

గణేశ్ నిమజ్జన విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 13: నగరంలో ఆదివారం చేపట్టనున్న వినాయకుని శోభాయాత్రలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఆయన కర్నూలు డివిజన్ అధికారులతో గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 నుంచి వారికి విద్యుత్ అధికారులకు కేటాయించిన రూట్స్‌లో విధుల్లో ఉండి విద్యుత్ అంతరాయాలు, సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వినాయక విగ్రహాల తరలింపులో విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, కేసీ కెనాల్ వినాయక నిమజ్జనం ప్రాంతంలో విద్యుత్ లైన్లు పరికరాలు సరైన క్లియరెన్స్ ఉండేలా చూడాలని అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఈఈ టి.శేషాద్రి, ఏడీఈలు, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో బళ్లారి రోడ్ సెక్షన్ ఎస్ఏపీ క్యాంప్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు కరెంట్‌కోత ఉంటుందని, ప్రజల విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, సెప్టెంబరు 13: మండలంలోని చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, పలుకుదొడ్డి గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో రాముడు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి ట్యాంక్‌లు, పైపులైన్లు, బోర్లకు మరమ్మతులు సర్పంచులకు ఆదేశించారు. ఎంపీ డీవో వెంట సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దళిత మహిళకు రక్షణ కల్పించాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవిందమ్మ కుమారుడు ఈరన్న అదే గ్రామానికి చెందిన మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. మహిళ బంధువులు అబ్బాయి తల్లి అయిన గోవిందమ్మను చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గోవిందు, కళావతి పాల్గొన్నారు.

లోకాయుక్తను కలిసిన వినియోగదారుల కమిషన్ చైర్మన్



జస్టిస్ లక్ష్మణరెడ్డికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వినియోగదారుల కమిషన్ చైర్మన్, సభ్యులు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 13: పదవీ విరమణ చేసిన రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డిని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు వినియోగదారుల కమిషన్ కృషి చేయా లని కోరారు. జస్టిస్ లక్ష్మణరెడ్డి దంపతులకు వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు నారాయణ రెడ్డి, మహిళా సభ్యురాలు నజీమా కౌసర్‌లు శాలువ కప్పి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 13: స్థానిక రైల్వేస్టేషన్‌లో జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి రమణ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రీడాదాత న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి హాజరై క్రీడాకా రులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో పలాస మండలంలో జరిగే 36వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, చిన్నసుంకన్న, శేషఫణి, సురేష్, మల్లయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు సెప్టెంబరు 13: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ పులకుర్తి లిఫ్ట్, 33 కేవీ గూడూరు ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనుండగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ/ ఆపరేషన్ జి.జేసన్, ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఆ సమయంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల పరిధిలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మేయింటెనెన్స్ చేపట్టనుండగా వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కాబట్టి ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని వారు కోరారు.

గణేశ్ నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 13: నగరంలో ఆదివారం నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వెల్లడించారు. శుక్రవారం కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద గల గణేశ్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా సంఘటన కార్యదర్శి డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, కార్యదర్శి రంగస్వామి, ఇతర ప్రతినిధులు గూడా సుబ్రహ్మణ్యం, సందడి సుధాకర్ పాల్గొన్నారు. డాక్టర్ నాగఫణిశాస్త్రి, వేణుగోపాల్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు పాతనగరంలోని శ్రీరాంభొట్ల దేవాలయం వద్ద గల విగ్రహానికి నిమజ్జనోత్సవ పూజతో వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం పాత బస్టాండు అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రారంభమవుతుందని, నిమజ్జనం సజావుగా సాగేందుకు ఘాట్లకు అటూ, ఇటూ 8 క్రేన్లు ఉపయోగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయ కులు సందడి మహేష్, అక్కెం విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం: మేయర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: నగరంలో గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని మేయర్ బీవై.రామయ్య అన్నారు. శుక్రవారం వినాయక ఘాట్‌ను మేయర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పరిశీలించారు. వీరి వెంట కార్పొరేటర్లు, అధికారులు ఉన్నారు.

నేడు మల్లమాంబ విగ్రహావిష్కరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 12: తొలి తెలుగు కవయిత్రి మల్ల మాంబ విగ్రహావిష్కరణ శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతున్నట్లు ఏపీ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు సూగూరు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మైసూరు మహారాజు, కర్ణాటక ఎంపీ ఎదువీర కృష్ణదత్త చామరాజు ఒడియార్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి శాలివాహనులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 13: క్రీడాకారులు క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని డాక్టర్ వాసురెడ్డి అన్నారు. శుక్రవారం ఆట్యా పాట్యా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఆయన టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఈనెల 14, 15 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. కార్యక్రమంలో డా.ఏ.సర్వోత్తమ్, నాగరత్నమయ్య, బాల పవన్, బాలాజీరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

బహుజనుల అభివృద్ధే లక్ష్యం

కల్లూరు, సెప్టెంబరు 13: బహుజనుల అభివృద్ధే పార్టీ లక్ష్యమని రాష్ట్ర అధికార ప్రతినిధి, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ ఎల్.వందనకుమార్ అన్నారు. శుక్రవారం బీఎస్పీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు జైరాజ్ ఆధ్వర్యంలో నగరంలోని సూరజ్‌గ్రాండ్‌లో నిర్వహించిన బీసీల కులగణన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నేడు 160 మహిళలతో బైబిల్ రీడింగ్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 13: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడమే లక్ష్యంగా శనివారం దేశ నలుమూలల నుంచి వస్తున్న 160 మంది మహిళలతో 8 గంటల వ్యవధిలో పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను పూర్తిగా చేతిరాత ద్వారా రాయబోతున్నారని బైబిల్ రీడింగ్ చాలెంజ్ గ్రూప్ నిర్వాహకులు జూలి ఫ్రాన్సిస్ కందుకూరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగర శివారులోని పుల్లారెడ్డి కాలేజీ సమీపంలో ఆర్‌సీ కన్వెన్షన్ (రేమా చర్చి)లో శనివారం ఈ కార్యక్ర మం నిర్వహిస్తున్నామన్నారు.

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి అని జిల్లా మోటార్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్, గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

● ఏపీ వేర్ హౌస్ హమాలీ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో వేర్ హౌస్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఆర్.నరసింహులు, సాయిబాబా, పాల్గొన్నారు.

● ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు సిటీ కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, సీహెచ్.శ్రీనివాసులు, శేషాద్రి, మద్దిలేటి, కర్రెన్న పాల్గొన్నారు. కార్మిక కర్షక భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్య దర్శి నగేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు నన్నూరు గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్, సుధాకర్, శేఖర్, ఎల్లరాజు, మాసూంబాషా, శ్రీరాములు, ఈశ్వరయ్య, జీవేశ్వరుడు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జే మోహన్, సీఐటీయూ మండల అధ్యక్షుడు గుంటప్ప, నాయకులు వెంకటేశ్వర్లు, రంగన్న, సోమలింగడు, మధు, మద్దిలేటి పాల్గొన్నారు.



కర్నూలులో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రైతు బజార్ ఏదీ?



ఎమ్మిగనూరులో రైతు బజార్‌కు కేటాయించిన స్థలం ఇదే

- ఎమ్మిగనూరులో ఏర్పాటు కాని రైతు బజారు
- పన్నెండేళ్ల క్రితం స్థలం కేటాయింపు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 13: అటు రైతులు, ఇటు ప్రజలకు మేలు కలిగేలా ప్రభుత్వం రైతు బజార్లను ప్రవేశపెట్టింది. జిల్లాలోని పట్టణాల్లో రైతుబజార్లు ఏర్పాటయ్యాయి. కానీ 1.20లక్షల జనాభా ఉన్న ఎమ్మిగనూరు పట్టణంలో మాత్రం ఆ జాడ లేదు. పన్నెండేళ్ల క్రితం పట్టణంలోని కస్తూరి స్కూల్ వద్ద డీసీఎంఎస్ స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు ప్రయత్నం జరిగింది. రూ.90 వేలు కేటాయించి రూ.50 వేలతో షెడ్లను ఏర్పాటు చేశారు. అయితే వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యం, పాలకవర్గం స్వార్థం కారణం గానో అది నిలిచిపోయింది. రూ.50వేలతో వేసిన తడికల షెడ్లుసైతం నేడు కనిపించడం లేదు. కేవలం ఒక బోర్డు మాత్రమే మిగిలింది.



రైతు బజారు ఏర్పాటు చేయాలి

పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. రైతు బజార్ లేకపోవటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించకపోగా, ఇటు వినియోగదారులు అధిక ధరలు చెల్లించి కూరగాయలు కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే రైతు బజార్‌ను ఏర్పాటు చెయ్యాలి. **- డి. గోవిందు, సీపీఎం నాయకుడు**

లాబీయింగే కారణమా?

రైతు బజార్ ఏర్పాటయితే తమ పరిస్థితి ఏంటని వ్యాపారులు, దళారులు లాబీయింగ్ చేసి అడ్డుకున్నట్లు చర్చ జరుగుతోంది. రైతు బజార్‌లో కూరగాయల ధర రోజుకు ఆరోజే. నిర్ణయించిన ధరకే అమ్మాల్సి ఉండటంతో వ్యాపారులు అడ్డుపడినట్లు తెలుస్తోంది.

వినియోగదారుల దోపిడీ

రైతు బజారు లేకపోవడంతో రైతులు నేరుగా కూరగాయలు విక్రయించుకునే అవకాశం లేదు. దీంతో వారు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్మాల్సి వస్తోంది. అయితే ఇటు వినియోగదారులు కూడా దోపిడీకి గురవుతున్నారు. వ్యాపారులు ఇష్టానుసారం ధరలు పెంచేయడంతో నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వక్ఫ్‌చట్ట సవరణను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 13: వక్ఫ్ చట్టాన్ని సవరణను రద్దు చేయాలని జామియా మసీదు ప్రెసిడెంట్ ఖాసింబేగ్, ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌సుకూర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ముస్లిం భావితరాల భవిష్యత్తు కోసం పూర్వీకులు వక్ఫ్ భూములను సమకూర్చాని అన్నారు. బీజేపీ ప్రభుత్వ నిర్ణయంతో అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, అమీద్, షేక్‌బతుల్లా, మౌలానాయూసూఫ్, ఉసేన్‌బాషా, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కుల వివక్షపై చర్యలు తీసుకోవాలి

నందవరం, సెప్టెంబరు 13: స్థానిక బస్టాండులో కుల వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శవాల బుజ్జిబాబు డిమాండ్ చేశారు. నందవరంలో ధర్నా నిర్వహించారు. బస్టాండ్‌లో వినోద్‌కుమార్ అనే వ్యక్తి టీస్టాల్ నడుపుతుండగా అందులో రెండు గ్లాసుల పద్ధతి పెట్టారని దళితులకు ఒక గ్లాసు, మరొకరికి ఇంకో గ్లాస్ ఇవ్వడంపై అభ్యంతరం తెలిపారు. ఆనంతరం తహసీల్దారు శ్రీనివాసులకు వినతిప్రతం అందజేశారు. హనుమన్న, రత్నం, చిన్నపోతప్ప, రాజు, ప్రకాష్, దేవదాసు, శాంతిరాజు, ఎసన్న, ఇస్మాయియల్ పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 13: విద్యారంగ పరి రక్షణకు పోరాటాలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. పోరాటాలతో సాధించుకున్న ప్రభుత్వ విద్యను పాలకులు నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ విద్యకు దాసోహమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతి గృహాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పత్తికొండలో బీసీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నజీర్, రోషన్, ఇర్ఫాన్, ఆలి, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ షమీల

ఆస్పరి, సెప్టెంబరు 13: అండర్-14, అండర్-17 ఎస్‌జీఎఫ్ మండలం స్థాయి క్రీడలను శుక్రవారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ షమీల ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగ, చెస్సులో విజేతలను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపుతామన్నారు. అనంతరం జామువా ఫౌండేషన్ అధ్యక్షుడు దేవేంద్ర మాట్లాడుతూ క్రీడాలు గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తాయయని అన్నారు. మాజీ సర్పంచ్ నాగరాజు ఉపాధ్యాయులు విజయ్, లతీఫ్, ఆనంద్, విష్ణు, రంగస్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందవరం, సెప్టెంబరు 13: ముగతి గ్రామం ఫైగేరిలో రూ.14 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ లక్ష్మీదేవమ్మ శుక్రవారం పనులను ప్రారంభించారు. బునకుంట దగ్గర ఆదెప్ప మల్లికార్జున ఇంటి నుంచి బుడ్డా ఖాజా ఇంటి వరకు పనులు చేస్తున్నామని తెలిపారు. రోడ్డు ఏర్పాటుతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

ఆదోని రూరల్ సెప్టెంబరు 13: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాగిని వసంత తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ నగర్‌లో గర్భిణులు, పిల్లలతో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యకర్తలు వర్కర్, విమల, ఎఎన్‌ఎం గీత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతులకు రాయితీ భోజనం అందించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 13: మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు రాయితీ భోజనాన్ని అందించాలని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు కన్నె జగదీష్, గాజుల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ, మార్కెట్‌కు దిగుబడులు వస్తున్నాయని రైతులతో పాటు, కూలీలు, హమాలీలకు కూడా ఈ రాయితీ భోజనాన్ని ఇవ్వాలని కోరారు.

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

తుగ్గలి, సెప్టెంబరు 13: భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. శుక్రవారం జొన్నగిరిలో రైతుల పొలాల సమస్యలపై సర్వే నిర్వహించారు. సర్వేయర్ లింగప్ప, వీఆర్వో కిరణ్ ఉన్నారు.

స్వాతంత్ర్య సాధనలో హిందీ భాష ఉపకారం


పెద్దతుంబళంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 13: స్వాతంత్ర్య సాధనలో హిందీ భాష మేలు చేసిందని విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు చాంద్ బాషా అన్నారు. స్థానిక మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దివస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. హిందీ భాష నేర్చుకుంటే ప్రపంచమంతా తిరిగి రావచ్చని వివరించారు. భాషల్లో హిందీ ప్రాముఖ్య మన్నారు. అనంతరం విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో అలరించారు. క్విజ్‌లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సీఈవో వెంకటేశులు, ఇన్‌చార్జి సుశీల, లావణ్య, యాస్మిన్, జయసింహ పాల్గొన్నారు.

పెద్ద తుంబళం జడ్పీ పాఠశాలలో..

జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం వెంకటేష్, హిందీ ఉపాధ్యాయులు నయనకుమారి హిందీ ప్రాముఖ్యతను వివరించారు. పదో తరగతి హిందీలో 99 మార్కులు సాధించిన ఫారుక్‌ని అభినందించారు.

ఎమ్మిగనూరు డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోండి


విజయవాడలో ఆర్టీసీ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 13: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం విజయవాడలో ఏపీఎస్ ఆర్టీసీ ట్రాన్స్‌పోర్టు ఎక్స్‌పర్ట్, రోడ్డు సేఫ్టీ అధికారి సురేష్ కుమార్‌ను కలిశారు. డిపో పరిధిలో బస్సు సర్వీసులు పెంచాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు విడుదలపై చర్చించారు. అలాగే డిపోకు నూతన బస్సులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పత్తి పంట ధ్వంసం


అలిగేరలో దుండగులు ధ్వంసం చేసిన పత్తి పంట

ఆస్పరి, సెప్టెంబరు 13: మండలంలోని అలిగేర గ్రామంలోని రైతు సందు అక్బర్‌కు చెదిన పత్తి పంటను ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి కథనం మేరకు.. తన సొంత పొలం మూడెకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఎకరానికి రూ.35 వేలు పెట్టుబడి పెట్టాడు. కొద్దిరోజుల్లో దిగుబడి వస్తుందనగా ఇలా అయిందని తనను ఆదుకోవాలని రైతు విలపించాడు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీసీ

కౌతాళం, సెప్టెంబరు 13: భక్తులు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వెంకటేష్ సూచించారు. శుక్రవారం ఆలయ పరిసరాలలో శ్రావణ మాసపు సందర్భంగా పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని తొలగించారు. చెత్తను పారిశుధ్య కార్మికులచే అక్కడి నుంచి తొలగింప చేశారు. క్యూలైన్లలో బారికేడ్లలో భక్తులు కట్టిన దారాలను తీసివేశారు. సూపరింటెం డెంట్లు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి


బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 13: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో మాదిగ గోవిందమ్మపై దాడిచేసిన చాకలి ఎర్రన్న, మూకప్ప బంధువులను తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోవిందమ్మను శుక్రవారం వారు పరామర్శించారు. జిల్లా అధికార ప్రతినిధి జయన్న మాట్లాడుతూ గోవిందమ్మపై దాడి చేసిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్నారు. దళితులకు రాజ్యాంగం వర్తించదా? అని ప్రశ్నించారు. ఇప్పటికీ తాము కుల వివక్ష ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజు, జయరాజు, విజయ్, మునెప్ప పాల్గొన్నారు.

కబడ్డీ, ఖో-ఖో విజేతగా కోసిగి బాలుర జట్టు


గెలుపొందిన కోసిగి బాలుర జట్టు

కోసిగి, సెప్టెంబరు 13: బాలుర అండర్-17 కబడ్డీలో కోసిగి, డీ.బెళగల్ జట్లు తలపడగా కోసిగి బాలుర జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌రప్‌తో డి.బెలగల్ సరిపుచ్చుకుంది. అండర్-17 ఖో-ఖో క్రీడల్లో కోసిగి వర్సెస్ కందుకూరు జట్టు తలపడగా ఫైనల్‌లో కోసిగి బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఖో-ఖోలో రన్నర్‌గా కందుకూరు జట్టు నిలిచింది. విజేతలకు హెచ్ఎం, పీఈటీలు షీల్డ్ అందజేశారు వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్రమ్మ, రామ చంద్ర, శివ, గంగాధర్, విరేష్, శేఖర్, బసవ ఉన్నారు.

నిమజ్జనంలో ఘర్షణ

- నెట్టేకల్లులో పోలీసులు, యువకుల మధ్య గొడవ


యువకుడి కాలికి దెబ్బలు

ఆదోని రూరల్ సెప్టెంబరు 13: ఆదోని మండలం నెట్టేకల్లు వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకోవటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. గడిచిన సోమవారం గ్రామంలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. అయితే రాత్రి 10 గంటలు దాటినా ఊరేగింపు కొనసాగడడంతో త్వరగా ముగించాలని ఎస్.ఐ రామాంజనేయులు హెచ్చరించారు. దీంతో ఎస్.ఐ జనసైనికుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తమపై లాఠీ చార్జి చేయంతో భక్తులు ఎదురు తిరిగారు. ఈ ఘర్షణలో వాసురెడ్డి, భీమేష్ అనే ఇద్దరు యువకులకు కాళ్ల, చేతులకు గాయాలయ్యాయి. అయితే తాము ఎంతసేపైనా ఊరేగింపు నిర్వహించుకునేందుకు ఓ కానిస్టేబుల్‌కు రూ.500 ఫోన్‌పే ద్వారా పంపినట్లు యువకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘర్షణ వాస్తవమే

నెట్టేకల్లు వినాయక నిమజ్జనంలో ఘర్షణ చోటుచేసుకోవటం వాస్తవమే. అయితే పోలీసులు ఎవరినీ కొట్టలేదు. పోలీసులపై కూడా ఎవరూ దాడి చేయలేదు.
- నల్లన్న, సీఐ, ఆదోని రూరల్

విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 13: విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అయిన బోయ వెంకటేశ్వర్లు గుండె పోటుతో మృతి చెందారు. వివరాల మేరకు.. చిన్నప్పటి నుంచి దేశభక్తి, పట్టుదలతో ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. 2003లో చేరి 17 సంవత్సరాలు సేవలందించారు 2020లో పదవీ విరమణ చేసి, పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉన్నారు. భార్య ఉమాదేవి వీరికి ఇద్దరు కూమారులు, కూతురు ఉన్నారు.

'జయరాం విధానాలతో నష్టం'

దేవనకొండ, సెప్టెంబరు 13: నియోజకవర్గంలో గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం విధానాలతో టీడీపీ నష్టపోయో ప్రమాదం ఉందని ఆ పార్టీ మండల నాయకులు బడిగింజల రంగన్న, వెలమకూరు సర్పంచు భాస్కర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసిన వ్యక్తికే ఇన్‌చార్జీ బాధ్యతలు ఇవ్వడం పార్టీ విధానమని అన్నారు. పార్టీలోని నాయకులు, కార్యకర్తలను విస్మరించి, వైసీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీలో చేర్పిస్తానని చెప్పడం జయరాంకు తగదన్నారు. గతంలో మంత్రిగా జయరాం టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసి మరలా ఇప్పుడు వైసీపీ వాళ్లతో గొడవలు సృష్టించేందుకు పన్నాగం పడుతున్నారని ఆరోపించారు. వీరభద్ర గౌడ్‌నే అధినాయత్వం ప్రకటించాలని కోరారు. వరిముక్కల నాగేశ్వర రావు, విష్ణు, చాంద్‌బాషా, లక్ష్మన్న, చిన్నపటేల్, సుధాకర్ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 13: ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కుర్నీ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం శక్తికేంద్ర ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. దేశాభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని అన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రెండు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును గతంకంటే రెట్టింపు స్థాయిలో చేయాలన్నారు. మధుకర్, సావిత్రి, మురళి నాయుడు, మంత్రాలయం కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ జీవోతో స్టాఫ్ నర్సులకు అన్యాయం


ఆదోనిలో ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 13: ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్.115తో తమకు అన్యాయం జరుగుతుందని స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మాతా శిశు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. సచివాలయ ఏఎన్‌ఎంలను స్టాఫ్‌నర్సులుగా నియమించ డంపై అభ్యంతరం తెలిపారు. 25 ఏళ్లుగా ఒప్పంద ప్రాతిప దికన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హెడ్‌నర్సు ప్రమీల, స్టాఫ్‌నర్సులు అనిత పుష్ప, నందిని, జ్యోతి, బిందు, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఏఎన్‌ఎంలకు స్టాఫ్ నర్సు ఉద్యోగాలివ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. శశికళ, నిర్మల రాణి, చంద్రకళ, నరసింహులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు



ఆదోని రూరల్: నివాళి అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

ఆదోని రూరల్ సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్షాలకు, బడుగు,బలహీన వర్గాలకు తీరని లోటని వెంకటేశులు, లింగన్న, మాలమహానాడు నాయకులు మహానంది, సాయిరాం అన్నారు. శుక్రవారం వేర్వేరుగా వీరు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మారుమూల గ్రామంలో పుట్టి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కమ్యూనిస్టు అభివృద్ధి కోసం ఏనలేని పోరాటాలు చేశారని కొనియాడారు.

గోనెగండ్ల: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి తీరని లోటని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శుక్రవారం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. మండల ఉపాధ్యక్షుడు దుండుఖాజా, యూటీఎఫ్ జిల్లా నాయకులు నరసింహులు, బాబు, ఈరన్నగౌడ్, నాగేష్, మారేష్, రంగన్న పాల్గొన్నారు.

కౌతాళం: సీపీఎం నాయకుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న నివాళి అర్పించి పార్టీ జెండాను అవనతం చేశారు.

పెద్దకడుబూరు: మండలంలోని నౌలేకల్లు గ్రామ పాఠశాలలో ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. డీవైఎఫ్ఐ నాయకులు ఉరుకుందు, గోవిందు, రాజజేంద్ర, మల్లికార్జున ఉన్నారు.

వరద బాధితులకు కొనసాగుతున్న సాయం

నిత్యావసరాలు, నగదు సేకరణ


ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్ననాయకులు


రూ.11 లక్షల చెక్కును చూపుతున్న టీడీపీ నాయకులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 13: వరద బాధితులకు సాయం కొనసాగుతోంది. శుకవారం కమ్మరచేడు గ్రామ ప్రజలు 376 ఆహార కిట్లను తయారు చేసి విజయవాడ కు పంపించారు. కిట్లలో బియ్యంతో పాటు అన్ని ఆహార వస్తువులు సమకూర్చానమని గ్రామస్థులు తెలిపారు. ఆనంద సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేపే శ్రీకంఠ మూర్తి రూ.50వేల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించినట్లు తెలిపారు. జంగమ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యండీ బసవరాజ్ ఆధ్వర్యంలో వీరశైవ ఆగమ పరిషత్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఎంఈవో గురునాథయ్య, జగదీష్ వరద బాధితుల కోసం రూ.10వేల చెక్కును ఎమ్మెల్యే పార్థసారథికి అందజేశారు.

రూ.11 లక్షలు సేకరించిన టీడీపీ

కౌతాళం : విజయవాడ వరద బాధితులకు కౌతాళం మండల టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, తెలుగు రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. కౌతాళం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వరదల వల్ల సర్వం కొల్పోయిన బాధితుకు తమ వంతుగా రూ. రూ.11,04141 సేకరించామని తెలిపారు. నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి ద్వారా సీఎం చంద్రబాబుకు అందజేస్తామని తెలిపారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, టీడీపీ నాయకులు శివమూర్తి, అమ్మువలి, నీలకంఠరెడ్డి, రాజానందు, వీరేష్, రామాంజనేయులు, శ్రీరాములు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహించాలి

హాలహర్వి, సెప్టెంబరు 13: ఉపాధి హామీ కింద సామాజిక తనిఖీలు సమగ్రంగా నిర్వహించాలని ఏపీడీ పద్మావతి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ పనులపై పూర్తిగా విచారణ చేయాలని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓలు హేమసుందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తుగ్గలి, సెప్టెంబరు 13: మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. తుగ్గలి, జొన్నగిరి సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రీడింగ్ రూం స్థలం ఆక్రమణ

- సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుల రీడింగ్ రూం

ఆలూరు, సెప్టెంబరు 13: పట్టణంలోని ఉపాధ్యాయ నగర్ సర్వే నెంబర్ 7559లోని ఉపాధ్యాయుల రీడింగ్ రూమును ఆక్రమించుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడు బాబా సాహెబ్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు నాగరాజు, గిర్రయ్య, ఈరన్న సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 1984లో వెంచర్ వేయమగా, 4.50సెంట్లు కొనుగోలు చేసి నిర్మాణం కూడా ప్రారంభించగా అనంతరం ఆగిపోయింది. నిర్వహణకు 5 మందితో ఒక కమిటీని వేశామని, అందులో సభ్యులకు తెలియకుండా బాబా సాహెబ్ తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకో డానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. సదరు స్థలాన్ని అమ్మడానికి, కొనడానికి వీలులేకుండా అప్పట్లో తీర్మానం కూడా చేశారన్నారు.. రీడింగ్ రూము స్థలం రిజిస్ట్రేషన్‌కు వస్తే నిలుపదల చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరామని అన్నారు.